కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి


బుడ్డా వెంగళరెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కనీవిని ఎరుగని డొక్కల కరువు సమయంలో ప్రజల ఆకలి తీర్చిన ఉయ్యాలవాడ బుడ్డా వెంగళరెడ్డి దానకర్ణుడిగా కీర్తింపబడుతున్నారని వక్తలు కొనియాడారు. మంగళవారం పట్టణంలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో వెంగళరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి మాట్లాడుతూ 1860లో రాయలసీమలో సంభవించిన డొక్కల కరువు బీభత్సాన్ని గమనించిన బుడ్డా వెంగళరెడ్డి గంజి కేంద్రాలను ప్రారంభించి తన వద్ద ఉన్న ధాన్యంతో మూడేళ్లపాటు అన్నదానం చేశారన్నారు. బుడ్డా వెంగళరెడ్డి దానగుణం తెలుసుకున్న ఇంగ్లాడ్ రాణి విక్టోరియా మహారాణి ఢిల్లీ పిలిపించి రాజప్రతినిధుల సభలో ఆయనకు బంగారు పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని ఇచ్చి ఘనంగా సన్మానించారన్నారు. ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి రేనాటి సూర్యచంద్రులుగా కొనియాడబడుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పీఠం సభ్యులు పల్లె చంద్రశేఖర్ రెడ్డి, ఏరాశి మహేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివన్న పాల్గొన్నారు.

నేరాలు.. ఘోరాలు

- 2024లో 46 హత్య కేసులు
- దళితులకు తప్పని అవమానాలు
- దొంగల చేతివాటమూ అధికమే!
- సైబర్ నేరాల్లో రికవరీ సున్నా..


2024 వార్షిక నేరాల నమోదు వివరాలను వివరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

జిల్లాలో నమోదైన నేరాల వివరాలు

2023	నేరం	2024
34	హత్యలు	46
0	దోపిడీలు	6
312	దొంగతనాలు	346
129	ఎస్సీ, ఎస్టీ కేసులు	135
29	సైబర్ నేరాలు	56
3	అత్యాచారాలు	3
601	అక్రమ మద్యం కేసులు	1457

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాలో నేరాలు ఘోరాలు 2024లో అధికంగా నమోదయ్యాయి. జిల్లాగా ఏర్పాటైనప్పుడున్న జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి 2024 జులైలో బదిలీ కాగా అధిరాజ్‌సింగ్‌రాణా అదేనెల 15న ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. మంగళవారం నాటితో 2024 సంవత్సరం ముగియనుండటంతో పోలీస్‌శాఖ జిల్లా వార్షిక నివేదికను విడుదల చేసింది. 2023తో పోలిస్తే 2024లో హత్యలు, సైబర్ నేరాలు, దొంగతనాలు ఎక్కువగానే జరిగాయి. నాటుసారా, అక్రమ మద్యం తరలింపు కేసులు కూడా అధికంగానే నమోదయ్యాయి.

హత్యలు..

జిల్లాలో 2024లో 46 హత్యలు జరిగాయి. అలాగే 6 దోపిడీ, 346 చోరీలు నమోదయ్యాయి. 28 హత్యాయత్నం కేసులతో పాటు మట్కా, గంజాయి కేసులు కూడా ఎక్కువగానే నమోదయ్యాయి.

సైబర్ కేటుగాళ్లదే పైచేయి

2024లో సైబర్ నేరగాళ్లు విచ్చలవిడిగా దోచుకున్నారు. జిల్లా కేంద్రంలో ఒక డాక్టర్‌ను డిజిటల్ అరెస్ట్ పేరుతో బురిడీ కొట్టించి ఏకంగా రూ.38 లక్షలు కాజేశారు. నకిలీ సంస్థల పేరుతో బిట్ కాయిన్స్ విక్రయించి ఒకరి నుంచి రూ.1కోటిగా పైగా కేటుగాళ్లు సొమ్ముచేసుకున్నారు. ఒక ఉపాధ్యాయుడు ఈఏడాది నకిలీ సంస్థను నమ్మి పెట్టుబడి పెట్టి రూ.8 లక్షలకు పైగా మోసపోయి చివరికి ఆత్మహత్యకు పాల్పడటం విచారకరం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 56 సైబర్ కేసులు నమోదయ్యాయి. కాగా రూపాయి కూడా రికవరీ కాలేదు.

మట్కా భూతం:

జిల్లాలో 2024లో మట్కా బాబులు వారి వ్యాపారాన్ని మరింత విస్తరింపజేశారు. 73 మట్కా కేసులకు గాను రూ.1,96,0052 నగను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసంఖ్యను చూస్తే మట్కా జిల్లా వ్యాప్తంగా కోరలు చాచుస్తుందో ఇట్టే అర్థమవుతుంది.

రక్తమోడినహదారులు

2024లో అతివేగం, మద్యం తాగి, నింధనలకు విరుద్ధంగా వాహనాలను నడపటం వల్ల 633 ప్రమాదాలు సంభవించాయి. తీవ్రమైన ప్రమాదాలు 61 నమోదయ్యాయి. 2023తో పోలిస్తే ప్రమాదాల సంఖ్య కాస్త తగ్గింది.

5న కురువ వివాహ పరిచయ వేదిక

కర్నూలు(అర్బన్): స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు కురువ, కురుబ, కురుమ కులస్థుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. ఈ వేదికకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణలో విడుదల చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కురువ సామాజిక వర్గానికి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ అవివాహిత పిల్లలకు వివాహాలు చేసేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, మహిళా విభా గం అధ్యక్ష, కార్యదర్శులు టీ శ్రీలీల, కే అనితాలక్ష్మి, తేజశ్వి ని, నాయకులు కేసీ నాగన్న, బీ వెంకటేశ్వర్లు, కే ధనుంజయ, బీ రామక్రిష్ణ, తవుడు శ్రీనివాసులు, పాల సుంకన్న, బీసీ తిరుపాలు, పుల్లన్న, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్


మెరిసిపోతున్న మున్సిపల్ కార్యాలయం

నూతన శోభ

నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. డోన్ కొండపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంతో పాటు మౌలాలి దర్గా, చర్చిలు విద్యుత్ దీపాలతో నూతన శోభను సంతరించుకున్నాయి. మున్సిపల్ కార్యాలయం, ఆర్ అండ్‌బీ వసతిగృహం, స్విమ్మింగ్ పూల్ దగదగలాడాయి. ఇవి పట్టణ ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. –డోన్

ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ

డోన్ టౌన్: ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరి ప్రచార మాసోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు కార్గో సేవలపై అవగాహన కల్పించారు.

సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లు ఆదా

బేతంచెర్ల: విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడానికి ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను రూరల్ ఏఈ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. గ్రామంలో మొదటిసారిగా ఈ పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్న శివయ్య, ప్రసన్నను అభినందించారు. మీటర్‌ను లైన్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

కూటమి ప్రభుత్వంపై ఉద్యమాలు

కర్నూలు(అర్బన్)/డోన్ రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కర్నూలులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా సీపీఐ కార్యాలయం సీఆర్ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు మాట మార్చి విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారన్నారు. పోరుబాటలో భాగంగా 2 నుంచి 10వ తేదీ వరకు పేద వారికి ఇంటి స్థలాలు, సొంత స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామన్నారు. కేంద్రం ప్రభుత్వం ధరలను అదుపు చేయడం లేదని ఆరోపించారు.

చంద్రబాబు చేప్పేవన్నీ అబద్ధాలే

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పేవన్నీ అపద్ధాలేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. డోన్ గెస్ట్‌హౌస్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం అప్పులపాలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి



బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గోవులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరానికి చెందిన గోవులు గ్రామసమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతోనే గోవులు మృతి చెందాయని శ్రీ కృష్ణమందిరం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాపరాతి పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి


ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు సమస్యను వివరిస్తున్న పరిశ్రమల యజమానులు

బేతంచెర్ల: నాపరాతి పరిశ్రమ రాయల్టీ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలని (కన్సిరడేషన్ ఫీజులు తగ్గించాలని) పరిశ్రమలు, లారీ, ట్రాక్టర్ యజమానులు, కార్మికులు బేతంచెర్లలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 5వ రోజుకు చేరుకుంది. ఎంపీ బైరెడ్డి శబరి, కోట్ల సుజాతమ్మ దీక్ష శిబిరానికి వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం శ్రీనగర్ కాలనీలో నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌తో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. పరిశ్రమల యజమానులు గౌరి హుసేన్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మోహన్‌రావు, రాంబాబు, తెలుగు రమణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన ఓ మహిళ మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పెద్ద నరసింహుడు భార్య అబిగళ్ల గౌరమ్మ(50) అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తితో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూమర్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

డోన్ టౌన్: చేతివృత్తుల వారికి ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన వరం లాంటిదని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి శివకృష్ణ అన్నారు. డేటా ప్రో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ పథకం కింద శిక్షణ పూర్తి చేసుకున్న 125 మందికి మంగళవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. చేతివృత్తుల వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్ఎం గీతా తెలిపారు. డిసెంబర్ 25, 26వ తేదీల్లో ముంబైలో జరిగిన జాతీయస్థాయి యంగ్‌మూడో పోటీల్లో తమ పాఠశాలకు చెందిన కుందన్, కార్తికేయ, సాన్విత, శ్రీవిద్య, ఎస్తేర్‌రాణి బంగారు పతకాలు, హేమచంద్రారెడ్డి, హర్షిత్‌రెడ్డి, కృష్ణ, కృష్ణస్వామి, రోషన్ వెండి పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీఈటీలు ఓబులేసు, హర్ష అభినందించారు.

గణితం ప్రకారం ఆకర్షణీయమైన సంఖ్య 2025

కర్నూలు కల్చరల్: గణితం ప్రకారం 2025కు ప్రత్యేకత ఉందని ఇది ఆకర్షణీయమైన సంఖ్య అని ప్రముఖ గణిత ఉపాధ్యాయులు డి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. 45×45=2025 ఒక వర్గ సంఖ్య, రెండు వర్గ సంఖ్యల లబ్దంగా కూడా దీన్ని రాయవచ్చన్నారు. మూడు సంఖ్యల వర్గంగా రాయగలిగిన ప్రత్యేక సంఖ్య కూడా అవుతుందన్నారు. 1936 (44×44) తర్వాత వచ్చిన వర్గ సంఖ్య 2025 అన్నారు. 2025 (45×45)తరువాత మళ్లీ ఇలాంటి వర్గ సంఖ్య 2116లో (46×46) వస్తుందన్నారు.

హైందవ శంఖారావ సభను జయప్రదం చేద్దాం

డోన్ టౌన్: దేశంలోని హిందూ దేవాలయాలు, ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5న విజయవాడలో చేపడుతున్న హైందవ శంఖారావ సభకు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ కోరారు. పట్టణంలోని వైష్ణవి ఆస్పత్రిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, రామయ్య, భరణి చంద్రశేఖర్, నాగార్జున, ఆశోక్ పాల్గొన్నారు.

విద్యార్థికి మార్గదర్శి గురువే


లీలావతమ్మను సత్కరిస్తున్న అధికారులు

డోన్ టౌన్: విద్యార్థికి గురువే మార్గదర్శి అని పట్టణాభివృద్ధిశాఖ డిప్యూటీ కలెక్టర్ భాగ్యరేఖ, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, హెచ్ఎం తొగట సురేష్‌బాబు అన్నారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయిని లీలావతమ్మ పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, రిటైర్డు హెచ్ఎం రామచంద్రుడు పాల్గొన్నారు.

పూత దశలో పంటను కాపాడుకోవాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పంట పూత, పిందె దశలో ఉందని, ఈ దశలో పైరును కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని వల్లంపాడు, లింగాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రస్తుత తరుణంలో శనగ పైరులో 13:0:45, 19:19:19 వంటి నీటిలో కరిగే ఎరువులను లీటరు నీటికి ఐదు గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పోరాటానికి ఎస్టీయూ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. సంఘం నాయకులు గిరీష్, వెంకటేశ్వరరెడ్డి, మనోహర్, గుర్రప్ప, జీవీ సుబ్బారెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలోని రామాలయంలో శాలివాహన సంఘం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ పురుషోత్తం, ఆ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు సోమేష్, నాయకులు సురేష్, శివరామమద్దిలేటి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 6,376 మంది హాజరు కాగా 2,752 మంది, నాల్గవ సెమిస్టర్‌కు 5,735 మందికి 3,133 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రీ వాల్యుయే షన్ చేయంచాలనుకునే వారు ఈనెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ గడువు పొడిగింపు

నంద్యాల: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్‌ల గడువును జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు (2 నెలలు) రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తి

బనగానపల్లె రూరల్: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం సాయంత్రానికి 96 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మొత్తం 12,352 మంది లబ్ధిదారులకు రూ.5.33 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. మిగిలిపోయిన లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. కాగా చాలా చోట్ల ఇంటింటికెళ్లి పింఛన్ అందించకుండా ఒకేచోట పంపిణీ చేశారు.

గోదాదేవికి పుష్పయాగం

డోన్: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా మంగళవారం గోదాదేవికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. బంగారు పుష్పాలు, గులాబి, చామంతి, కనకాంబరం వంటి 19 రకాల పుష్పాలతో అమ్మవారికి పుష్పార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ, గోవింద మాలధారులు పాల్గొన్నారు.



అమ్మవారికి పుష్పయాగం చేస్తున్న అర్చకుడు

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని సుమేధా పాఠశాల విద్యార్థులు ఈనెల 29న నంద్యాలలో జరిగిన అండర్ 12, 14 జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటినట్లు కరాటే మాస్టర్లు నాగన్న, వెంకటేశ్వర్లు తెలిపారు. 19 బంగారు పతకాలు, 7 సిల్వర్ మెడల్స్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మంగళవారం స్కూల్ కరస్పాండెంట్ విజయనాగరాజు, కోఆర్డినేటర్ మహేశ్వరి విద్యార్థులను అభినందించారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తే గుర్తింపు

బేతంచెర్ల: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని డీఎల్‌పీఓ బాలకృష్ణ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో జూనియర్ అసిస్టెంట్ ఆసయ్య పదవీ విరమణ సందర్భంగా సత్కరించారు. పీఎస్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, ఎంపీటీసీ ఇందిర, ఈఓఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.